సాక్షి ఖమ్మం

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



ఉరుములు, మెరుపులతో వాన

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 8లో



పాలేరు కాల్వకు నీటి విడుదల

వరదలతో పాలేరు ఎడమ కాల్వకు పడిన గండ్ల మరమ్మతు పూర్తికావడంతో మంగళవారం నీరు విడుదల చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం 31° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం వాతావరణం చల్లగానే ఉంటుంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

30న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

ఖమ్మం రాపర్తినగర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన ఈనెల 30వ తేదీన జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే ఈ పోటీల్లో 15 నుంచి 29 ఏళ్ల లోపు వయస్సు కలిగిన యువతీ యువకులు పాల్గొనవచ్చని, ఇక్కడ ప్రతిభ కనబరిచి వారిని రాష్ట్రస్థాయి పోటీలను ఎంపిక చేస్తామని వెల్లడించారు. జానపద నృత్యం, వ్యక్తిగత, బృంద నృత్యాలు, పాటల పోటీలు, వ్యాసరచన, పోస్టర్ల తయారీ, వక్తృత్వం, కవిత్వం తదితర అంశాల్లో పోటాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పేర్లను ఈనెల 28వ తేదీలోగా స్వయంగా సర్దార్ పటేల్ స్టేడియంలో లేదా, dysokmm@ gmail.com మెయిల్‌కు పంపించాలని, వివరాలకు 98948 207271 నంబర్‌లో సంప్రదించాలని డీవైఎస్‌ఓ సూచించారు.

మహిళలకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ఖమ్మంఅర్బన్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా ఉపాధి కోర్సుల్లో గతంలో శిక్షణ పొందిన మహిళలకు మరోసారి ఆరు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ వి.విజేత తెలిపారు. ఇప్పటికే టైలరింగ్, బుట్టలు, చీపుర్ల తయారీ, బ్యూటీషియన్, సాఫ్ట్ టాయిస్ తయారీలో శిక్షన పొందిన వారు సర్టిఫికెట్లు జత చేసి ఈనెల 28వ తేదీలోగా టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. ఆరు రోజుల శిక్షణలో రూ.4వేలు స్టైఫండ్, రూ.15 వేల విలువైన కిట్ ఇస్తామని తెలిపారు. వివరాలకు 76600 22512 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. అలాగే, మహిళా ప్రాంగణంలో టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు నేర్పేందుకు ఆసక్తి ఉన్న ఇన్‌స్ట్రక్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని మేనేజర్ తెలిపారు.

డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

● ఆర్టీసీ ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: రహదారులపై వాహనాల రద్దీ నేపథ్యాన ప్రమాదాల సంఖ్య కూడా పెరిగిందని.. ఈక్రమంలో ఆర్టీసీ బస్ డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ సూచించారు. రీజియన్ పరిధిలో ఇటీవల జరిగిన ప్రమాదాలు, బస్సులు దెబ్బతినడానికి కారకులైన డ్రైవర్లకు ఖమ్మంలో మంగళవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లోకెల్లా టీజీఎస్ ఆర్టీసీలో మాత్రమే అతి తక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సంస్థపై నమ్మకంతో ఉండే ప్రయాణికులే కాక డ్రైవర్ల కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల సంఖ్య మరింత తగ్గించేలా సురక్షితమైన విధానాలు అవలంబించాలని సూచించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్) ఎస్.భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ఐటీఐలను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్)లుగా మారుస్తూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో ఆరు ట్రేడ్లల్లో నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) ప్యాట్రన్ కింద ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కన్వీనర్, ఖమ్మం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 25నుంచి 28వ తేదీ ఉదయం 11గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మానుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. http://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ధృవపత్రాలు, ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆతర్వాత నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఇచ్చేదే లేదు.. ఏం చేస్తారు?!



కొణిజర్లలోని ఎస్‌ఏఆర్ మిల్లులో తనిఖీకి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారుల వాహనాలు

సీఎంఆర్ అప్పగింతలో మిల్లర్ల నిర్వాకం

- ఈ సీజన్‌లో ఇప్పటికి 72 శాతం మాత్రమే డెలివరీ
- 17 మిల్లులు 60 శాతంలోపే బియ్యం అప్పగింత
- ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నేతలతో యంత్రాంగంపై ఒత్తిడి
- సన్న బియ్యం పంపిణీ నిర్ణయం నేపథ్యాన ప్రభుత్వం సీరియస్
- జిల్లాలోని మిల్లులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ప్రభుత్వానికి అప్పగించడంలో మిలర్ల తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రతీ సీజన్‌లోనూ లక్ష్యం మేరకు సీఎంఆర్ అప్పగించకపోగా తమను ఏమీ చేయలేరనే ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం. పౌరసరఫరాల సంస్థ ఏ సీజన్‌లో అప్పగించే ధాన్యాన్ని మర ఆడించి బియ్యాన్ని సరఫరా చేయాలి. కానీ గడువులు ముగుస్తున్నా పట్టించుకోకపోగా, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి తీసుకురావడం ఆనవాయితీగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈనెల చివరి నాటికి సీఎంఆర్ ఇవ్వాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధిస్తే లక్ష్యంలో 72శాతమే పూర్తయింది. ఇక 17 మిల్లులైతే 60 శాతం లోపే బియ్యాన్ని అప్పగించడం గమనార్హం. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం మిల్లర్ల తీరుపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాలోని పలు మిల్లుల్లో మంగళవారం హైదరాబాద్ నుంచి వచ్చిన పౌరసరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

ఆరు రోజుల్లో 22 వేల క్వింటాళ్లు..

2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో పౌరసరఫరాల సంస్థ 1,20,533.280 క్వింటాళ్ల ధాన్యాన్ని 66 మిల్లులకు మిల్లింగ్ కోసం ఇచ్చింది. ఇందులో 67 శాతంగా అంటే 80,903.062 క్వింటాళ్ల బియ్యాన్ని మూడు నెలల్లోగా అప్పగించాలి. ఇప్పటి వరకు 58,097.570 క్వింటాళ్ల బియ్యం(72శాతం) మాత్రమే చేరవేశారు. ఇంకా 22,805 క్వింటాళ్లను మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. కాగా, జిల్లాలోని 16 మిల్లుల బాధ్యులు 60 శాతంలోపే సీఎంఆర్ ఇచ్చారు. ఈనెల 30తో సీఎంఆర్ గడువు ముగియనుండగా మిగిలిన ఆరు రోజుల్లో 22వేల క్వింటాళ్లు ఇస్తారా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పక్కదారి పట్టాయా ?

గడువు లోగా సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై ప్రభుత్వం నిఘా వేసింది. సీఎంఆర్ ఇవ్వని మిల్లుల్లో బియ్యం నిల్వలు లేవనే సమాచారం అందినట్లు తెలిసింది. చాలామంది మిల్లర్లు బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈనేపథ్యాన ఆయా మిల్లులకు ఇకపై ధాన్యం ఇవ్వొద్దని నిర్ణయించిన ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే పౌరసరఫరాల సంస్థ నేతృత్వాన హైదరాబాద్‌తో పాటు జిల్లాకు చెందిన టాస్క్‌ఫోర్స్ అధికారులతో తనిఖీలు చేయిస్తోంది.

కఠినంగా వ్యవహరిస్తేనే..

ఈ సీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించి మర ఆడించాక వచ్చే ఏడాది జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, చాలా మంది మిల్లర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున అలాంటి వారికి సీఎంఆర్ ఇచ్చేది లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. కొందరు ధాన్యాన్ని దారి మళ్లించడం, మరికొందరు బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో డీఫాల్ట్ అయిన మిల్లర్లు బకాయి ఉన్న సీఎంఆర్ అప్పగించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల నుంచి 'నో డ్యూ సర్టిఫికెట్' సమర్పిస్తేనే ధాన్యం కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం అమలు కావాలంటే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

2023-24 ఖరీఫ్ సీజన్‌లో ఇలా...

జిల్లాలో మిల్లులు	66
అప్పగించిన ధాన్యం	1,20,533.280 క్వింటాళ్లు
తిరిగి ఇవ్వాల్సిన బియ్యం	80,903.062 క్వింటాళ్లు
ఇప్పటి వరకు ఇచ్చింది	58,097.570 క్వింటాళ్లు
ఇంకా బకాయి	22,805 కింటాళ్లు

కొణిజర్లలోని మిల్లుపై..

జిల్లాలోని రైస్‌మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా నిల్వ ఉంచుతున్నారని, కొందరు మర ఆడించినా బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వడం లేదని గుర్తించారు. ఈ నేపథ్యాన రాష్ట్రంలోని పలు మిల్లుల్లో ఇప్పటికే తనిఖీలు చేయించగా కొణిజర్లలోని ఎస్‌ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం దాడులు చేపట్టింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగాయి. ఈ మిల్లుకు కేటాయించిన 15,720.68 క్వింటాళ్ల ధాన్యానికి గాను 10,656.973 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ ఈనెల 21 నాటికి 3,857 క్వింటాళ్ల సీఎంఆర్(36శాతం) మాత్రమే డెలివరీ చేశారు. ఇంకా 6,838.161 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉండడంతో నిల్వలను పరిశీలించారు. కాగా, టాస్క్‌ఫోర్స్ బందాల తనిఖీలు బుధ, గురువారాల్లో కూడా కొనసాగే అవకాశముందని తెలిసింది.

హైవేలతో ఖమ్మంకు రింగ్‌రోడ్డు

- వంద రోజుల్లోగా ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పునరుద్ధరణ
- నిపుణుల ఆధ్వర్యాన రిటైనింగ్ వాల్ నూతన డిజైన్
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైవేల మ్యాప్ చూపిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సహకారనగర్: జాతీయ రహదారుల నిర్మాణంతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటవుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదతో ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై 24 స్పాన్లల్లో తొమ్మిది పక్కకు జరిగాయన్నారు. ఈక్రమాన పిల్లర్లకు ఇబ్బంది లేకపోయినా స్లాబ్ పక్కకు జరిగినందున నిపుణుల పరిశీలన అనంతరం కాంట్రాక్టర్లకు పనులు అప్పగించామని తెలిపారు. మరో 100 రోజుల్లోగా ప్రకాష్‌నగర్ బ్రిడ్జిని పునరుద్ధరించనున్నందున అప్పటివరకు ఎవరినీ అనుమతించబోమని, ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు. కాగా, మునుపెన్నడూ లేని విధంగా మున్నేరుకు 42 అడుగుల వరద వచ్చిన నేపథ్యాన నిపుణుల కమిటీతో రిటైనింగ్ వాల్ రీ డిజైనింగ్ చేయిస్తున్నామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరం నుంచి డ్రెయిన్ల నీరు నదిలోకి ఎలా వెళ్లాలనే అంశంపై సర్వే జరుగుతోందని వెల్లడించారు.

చకచకా జాతీయ రహదారులు

రూ.వెయ్యి కోట్లకు పైగా నిధులతో ఖమ్మం–కోదాడ మార్గంలో 31 కి.మీ. జాతీయ రహదారి నిర్మాణం పూర్తయిందని మంత్రి చెప్పారు. అలాగే, ఖమ్మం – దేవరపల్లి జాతీయ రహదారిని ఉగాది వరకు పూర్తి చేస్తామన్నారు. మంచిర్యాల – వరంగల్, ఖమ్మం – అమరావతి జాతీయ రహదారి, సూర్యాపేట – ఖమ్మం, రాజమండ్రి జాతీయ రహదారి మధ్యలో మిగిలే ఆరు కిలోమీటర్ల నిడివి రహదారిని రూ.120 కోట్లతో చేపట్టిన అమరావతి రహదారికి కలపనున్నామని చెప్పారు. తద్వారా ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పడుతుందని, ఆపై ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.750కోట్ల నష్టం

ఈనెల మొదటి వారంలో వచ్చిన వర్షాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కేవలం రోడ్లు భవనాల శాఖ పరిధిలోనే రూ.750 కోట్ల మేర నష్టం జరిగిందని మంత్రి తెలిపారు. రహదారులు, బ్రిడ్జిల తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.25 కోట్లు మంజూరు చేస్తామన్నారు. ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కాగా, రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని మంత్రి కోరారు. పంట నాటిన మూడేళ్ల తర్వాత మంచి ఆదాయం వస్తుందని, ఆలోపు అంతర్ పంటల ద్వారా ఆదాయం పొందొచ్చని మంత్రి తెలిపారు.

నష్టంపై సర్వే పూర్తయ్యాక రైతుభరోసా

ఖమ్మం నగరంలో నాలాలు, చెరువు శిఖం భూముల్లో ఆక్రమణల తొలగింపునకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. గతంలో నక్షాల ఆధారంగా పరిశీలించి అందరి సమక్షంలోనే ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక రుణమాఫీ ప్రక్రియ జరుగుతోందని, ఇటీవల కురిసిన వర్షాలతో జరిగిన పంట నష్టంపై సర్వే పూర్తికాగానే పరిహారంతో పాటు రైతు భరోసా కూడా అందిస్తామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, ఆర్ అండ్ బీ సీఈ మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెసల కొనుగోళ్లను తనిఖీ చేసిన మంత్రి



పెసల నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన పెసల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనిఖీ చేశారు. మార్క్‌ఫెడ్ అధికారులతో రైతులు పడుతున్న ఇబ్బందులపై 'మార్క్‌ఫెడ్.. మజాకా!' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితం కాగా స్పందించిన మంత్రి మార్కెట్‌కు వచ్చారు. ఈసందర్భంగా పలువురు రైతులు తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పేరిట ఇబ్బంది పెడుతున్నారని, ఫలితంగా రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే, కౌలు రైతుల పంట కొనుగోలులో సమస్యలను వివరించారు. కాగా, ఇప్పటి వరకు ఖమ్మం, వైరా వ్యవసాయ మార్కెట్లలో 391 మంది రైతుల నుంచి 4,292 క్వింటాళ్ల పెసలు కొనుగోలు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం చెప్పగా మంత్రి తుమ్మల మాట్లాడారు. రైతులు విక్రయానికి తీసుకువచ్చే పంట చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడొద్దని తెలిపారు. ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, నాలుగు రోజులుగా మార్కెట్‌లో ఉన్న రైతుల నుంచి పెసలను మంగళవారం కొనుగోలు చేశారు. 12 శాతం వరకు తేమ ఉన్న పెసలు కొనుగోలుచేసి వెంటనే కాంటా వేయించారు.

విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసి జెండా ఊపుతున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచిలో జూనియర్ కాలేజీ ప్రారంభం

కూసుమంచి: రాష్ట్రప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలో ఈ విద్యాసంవత్సరం ఏర్పాటుచేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో కలిసి మంత్రి మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశాక మంత్రి పొంగులేటి మాట్లాడారు.

మౌలిక వసతుల కల్పనకు రూ.637 కోట్లు

కూసుమంచిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రితో మాట్లాడి మంజూరు చేయించానని మంత్రి తెలిపారు. ఈ ప్రాంత ప్రజల తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నానని వెల్లడించారు. కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కాగా, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.637 కోట్లు వెచ్చించిందని, విద్యాసంవత్సరం మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించామని తెలిపారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందిని నియమించడమే కాక ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఇంగ్లిష్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయించామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇతర గ్రామాల నుండి వచ్చే విద్యార్థినులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సైకిళ్లను మంత్రి అందజేశారు. అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావుతో పాటు నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, సీతారాములు, స్వర్ణకుమారి, గోపాలరావు, బానోత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలుగా సీనియర్ హెచ్‌ఎంలు

- మండలాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం
- పర్యవేక్షణ సులువయ్యేలా ప్రభుత్వ నిర్ణయం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపర్చేందుకు పలు నిర్ణయాలు తీసుకుంటోంది. కానీ ఎంఈఓల కొరత కారణంగా పాఠశాలలపై పర్యవేక్షణ కరువవుతోంది. ప్రస్తుతం రెగ్యులర్ ఎంఈఓల కొరతతో ఉన్నవారికే రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు కేటాయించారు. ఈ సమస్యను అధిగమించేలా ఆయా మండలాల పరిధిలో గ్రేడ్–2 సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలను ఎఫ్‌ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జ్) ఎంఈఓలుగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా వెంటనే విధుల్లో చేరనున్నారు.

ఇద్దరే రెగ్యులర్ ఎంఈఓలు

జిల్లాలో 21 మండలాలకు గాను ఇద్దరు రెగ్యులర్ ఎంఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో రఘునాథపాలెం ఎంఈఓగా బి.రాములు, ఖమ్మం రూరల్ ఎంఈఓగా ఎం.శ్రీనివాస్ ఉన్నారు. ఇంకొన్ని మండలాలకు కూడా వీరే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈనేపథ్యాన రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మినహా మిగతా మండలాలకు ఎఫ్‌ఏసీ ఎంఈఓలను నియమించడంతో పర్యవేక్షణ సులువవుతుందని భావిస్తున్నారు.

హెచ్‌ఎం పేరు	కేటాయించిన మండలం	హెచ్‌ఎం పేరు	కేటాయించిన మండలం
		డి.జయరాజు	సింగరేణి
డి.అబ్రహం	కొణిజర్ల	పి.నివేదిత	కల్లూరు
కె.వెంకటేశ్వరరావు	వైరా	బి.మురళీమోహన్‌రావు	ఎర్రుపాలెం
సీహెచ్.వెంకటేశ్వరరావు	వేంసూరు	డి.రమణయ్య	ముదిగొండ
హెచ్.శ్రీనివాస్	ఏన్కూరు	జి.వెంకట్	కామేపల్లి
ఎన్.డి.ప్రసాద్	తల్లాడ	ఎన్.రాజేశ్వరరావు	సత్తుపల్లి
వై.ప్రభాకర్	మధిర	కే.వీ.శైలజలక్ష్మి	ఖమ్మం అర్బన్
వి.శ్రీనివాసరావు	చింతకాని	ఆర్.వీరస్వామి	కూసుమంచి
డి.పుల్లయ్య	బోనకల్	బి.చలపతిరావు	నేలకొండపల్లి
ఎస్.సత్యనారాయణ	పెనుబల్లి	ఎం.శ్రీనివాసరావు	తిరుమలాయపాలెం

ఎండిన పొలాల పరిశీలన



ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కూసుమంచి: మండలంలోని మల్లాయిగూడెంలో సాగర్ జలాలు అందక ఎండిపోయిన వరి పొలాలను మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. భారీ వర్షాలతో ఇటీవల సాగర్ ఎడమ కాల్వకు గండి పడగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా కాల్వ నీటిపైనే ఆధారపడిన సాగుచేసిన వరి పంట చాలాచోట్ల ఎండిపోయింది. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ నష్టంపై రైతులతో మాట్లాడారు. గండ్ల పూడ్చివేత పనులు పూర్తయినందున నీరు అందుతుందని భరోసా కల్పించారు. డీఏఓ పుల్లయ్య, ఏడీఏ సరిత, ఏఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

మనసు, సమాజం స్వచ్ఛంగా ఉండాలి

'స్వచ్ఛతా హీ సేవా'లో జిల్లా జడ్జి రాజగోపాల్



కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్, తదితరులు

ఖమ్మంలీగల్: మహాత్మాగాంధీ ఆశించిన స్వచ్ఛభారత్ కల సాకారం కావాలంటే సమాజంతో పాటు ప్రతీ వ్యక్తి మనసు కూడా స్వచ్ఛంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కేవలం ఒక్కరోజు మాత్రమే కాకుండా ప్రతీరోజు స్వచ్ఛత కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో మిగతా న్యాయమూర్తులతో కలిసి శుభ్రం చేశారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనకుమారి, ఎం.కల్పన, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతిలత, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

దానవాయిగూడెం ఇన్‌టేక్ వెల్ మరమ్మతులు పూర్తి

నేటి నుండి పూర్తి స్థాయిలో నీటి సరఫరా



ప్యానల్ బోర్డ్‌లో స్విచాన్ చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరుకు వచ్చిన భారీ వరదతో ఖమ్మంలోని దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ వద్ద తాగునీరు సరఫరా చేసే ఇన్ టేక్‌వెల్‌లో పరికరాలు మరమ్మతుకు గురైన విషయం విదితమే. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోవడమేకాక ప్యానల్ బోర్డు కొట్టుకుపోయింది. అంతేకాక ఇన్ టేక్‌వెల్‌లోని మూడు పంపు సెట్లు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా గత ఇరవై రోజులుగా నగరంలో తాగునీటి సరఫరాకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. దీంతో 22.5 ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేసే ఈ ఇన్ టేక్‌వెల్‌లో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన మరమ్మతులు మంగళవారం పూర్తయ్యాయి. ఈ మేరకు బుధవారం నుండి నగరమంతా పూర్తిస్థాయిలో తాగునీటి జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

పాడి పరిశ్రమ చైర్మన్‌ను కలిసిన డీడీ


చైర్మన్‌కు జ్ఞాపిక ఇస్తున్న డీడీ మోహనమురళి, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ(విజయ డెయిరీ) చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని ఉమ్మడి ఖమ్మం జిల్లా పాడి పరిశ్రమ సంస్థ ఉప సంచాలకులు(డీడీ) మోహనమురళి కలిశారు. వివిధ జిల్లాల అధికారులతో కలిసి చైర్మన్‌ను ఆయన హైదరాబాద్‌లో కలవగా, పాల ఉత్పత్తి, సేకరణపై చర్చించారు. అలాగే, పాడి ఉత్పత్తిని తీసుకోవాల్సిన చర్యలు, రైతుల ప్రయోజనాలపై చైర్మన్ సమీక్షించారని తెలిపారు.

ట్రస్మా ఆధ్వర్యాన నోట్ పుస్తకాలు


డీఈఓకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ట్రస్మా బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: వరద బాధిత ప్రాంతాల పాఠశాలల్లోని విద్యార్థులకు ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) వైరా డివిజన్ బాధ్యులు రూ.20వేల విలువైన నోట్ పుస్తకాలను సమకూర్చారు. ఈ పుస్తకాలను ఖమ్మంలో మంగళవారం ట్రస్మా డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడేపూడి కిరణ్, నర్సింహారావు డీఈఓ సోమశేఖరశర్మకు అందజేసి మాట్లాడారు. ఇటీవల ఖమ్మం పరిసరాల్లో వచ్చిన భారీ వరదలతో పిల్లలు నష్టపోయినందున తమ వంతుగా నోట్‌పుస్తకాలు సమకూర్చామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రసన్న, ఉమాశంకర్, మల్లికార్జున్, రామారావు పాల్గొన్నారు.

భార్యపై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి

నేలకొండపల్లి: కుటుంబ తగాదాల నేపథ్యాన ఓ వ్యక్తి విచక్షణారహితంగా తన భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. నేలకొండపల్లి మండలంలోని అప్పలనరసింహాపురానికి చెందిన నాగలక్ష్మి(30)కి సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని కందిబండకు చెందిన వెంకటేశ్వర్లుతో వివాహం జరిగింది. వీరికి ఇరువురు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లుగా తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో నాగలక్ష్మి పుట్టింటికి వచ్చింది. కాగా, సోమవారం రాత్రి వెంకటేశ్వర్లు భార్య వద్దకు వచ్చాడు. రాత్రి భోజనం చేసి నిద్రించే వరకు బాగానే ఉన్నా ఆతర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం తెల్లారుజామున గొడ్డలితో ఆమె భుజాలు, కాళ్లపై దారుణంగా నరికాడు. ఆమె కేకలు వస్తుండడంతో కుటుంబీకులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పోలీసులు చేరుకుని వివరాలు ఆరా తీశారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖమ్మంరూరల్: మండలంలోని బారుగూడెం వాటర్ ట్యాంక్ వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామానికి చెందిన ఎనిమిది మంది డబ్బు పందెం కాసి పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకన్నామని ఎస్‌హెచ్‌ఓ ముష్కాన్‌రాజు తెలిపారు. వీరి నుండి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండకు చెందిన రామారావు ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలో భద్రపరిచిన రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.3వేలు చోరీ జరిగినట్లు ఆయన మంగళవారం గుర్తించాడు. ఈమేరకు రామారావు ఫిర్యాదుతో రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,000	2,000
పెసలు	7,201	4,500
పెసలు(మార్క్‌ఫెడ్)	8,682	8,682
కందులు	8,800	8,800
మిర్చి	17,800	6,100
మిర్చి తాలు	9,150	8,500
ఏసీ మిర్చి	20,000	10,000
ఏసీ తాలు	9,000	8,000
కొత్త పత్తి	7,111	5,600
పాత పత్తి	7,650	4,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

ఉరుములు, మెరుపులతో వాన

- అత్యధికంగా గౌరారంలో 60.5 మి.మీ.గా నమోదు
- సాగులో ఉన్న పైర్లకు ప్రయోజనకరం
- ఉష్ణోగ్రతల నుంచి జనానికి ఉపశమనం


సత్తుపల్లి : మధ్యాహ్నం 3.30గంటలకు మేఘావృతమైన ఆకాశం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం కారణంగా ఏర్పడిన అల్పపీడనంతో వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి ఎండగానే ఉన్నప్పటికీ మధ్యాహ్నానికి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మధ్యాహ్నం పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇక సాయంత్రం 4గంటల తరువాత ఖమ్మం నగరంతో పాటు కూసుమంచి, మధిర ప్రాంతాల్లో వర్షం ప్రారంభమై పొద్దుపోయేవరకు కొనసాగింది. జిల్లా కేంద్రంలోని పలుచోట్ల భారీ వర్షం కురవగా రహదారులపై వరద పారింది. వాతావరణ శాఖ విడుదల చేసిన గణాంకాల ఆధారంగా జిల్లాలో అత్యధికంగా పెనుబల్లి మండలం గౌరారంలో 60.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇక తల్లాడ, సత్తుపల్లి, ఖమ్మం, కొణిజర్ల, వేంసూరు, రఘునాథపాలెం, మండలాల్లోనూ ఓ మోస్తరు వర్షపాతం నమోదు కాగా, కామేపల్లి, ఏన్కూరు, సింగరేణి, ముదిగొండ, వైరా, కల్లూరు, ఎర్రుపాలెం మండలాల్లో వర్షప్రభావం అంతంతే ఉంది.

తగ్గిన వేడి

సెప్టెంబర్ రెండో వారం తర్వాత జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. 33 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వేసవి మాదిరి ఉక్కపోత ఉంటోంది. ఈనేపథ్యాన మంగళవారం కురిసిన వానతో వాతావరణం కాస్త చల్లబడగా ప్రజలకు ఉపశమనం లభించినట్లయింది.

విద్యుత్ అంతరాయం.. పొంగిన నాలాలు

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా మంగళవారం సాయంత్రం తర్వాత జిల్లాలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలతో పాటు జిల్లాలోని వైరా, సత్తుపల్లి విద్యుత్ డివిజన్లలో అంతరాయాలు చోటు చేసుకున్నాయి. సత్తుపల్లి అయ్యగారిపేట రోడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇన్సులేటర్ ఫెయిల్ అయి పెద్దశబ్దంతో మంటలు రావడంతో సరఫరా నిలిచిపోయింది. ఇక ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో నాలాలు పొంగి ప్రవహించాయి. డ్రెయినేజీల్లో నీరు వెళ్లే మార్గం లేక రహదారులపైకి చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పాత బస్టాండ్, వైరా రోడ్, కమాన్ బజార్, కస్బా బజార్, గాంధీచౌక్, పొట్టి శ్రీరాములు రోడ్, హర్కారా బావి సెంటర్, శ్రీశ్రీ సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది.

మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పలు ప్రాంతాల్లో వర్షపాతం (మి.మీ.ల్లో)

ప్రాంతం	వర్షపాతం
గౌరారం (పెనుబల్లి)	60.5
నేలకొండపల్లి	56.0
ప్రకాశ్‌నగర్ (ఖమ్మం)	51.0
పమ్మి (ముదిగొండ)	49.0
పెనుబల్లి	42.0
గుబ్బగుర్తి (కొణిజర్ల)	37.5
వేంసూరు	36.5
తల్లాడ	32.3
సత్తుపల్లి	31.0
కూసుమంచి	28.8
మదిగొండ	28.5
వీ.వీ.పాలెం(రఘునాథపాలెం)	26.8
గంగారం (సత్తుపల్లి)	26.5
కాకరవాయి (తిరుమలాయపాలెం)	19.8
పంగిడి (రఘునాథపాలెం)	19.3

పైర్లకు ప్రయోజనమే

ప్రస్తుతం కురుస్తున్న వానలు సాగులో ఉన్న పైర్లకు ప్రయోజనం కలిగించనున్నాయి. ఈనెల మొదటి వారంలో భారీ వర్షాలు కురిశాయి. ఆతర్వాత రెండు, మూడో వారం వర్షాలు లేకపోగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈ ప్రభావం పైర్లపై పడింది. పలుచోట్ల వర్షాధారంగా సాగు చేస్తున్న పైర్లు వడలిపోతున్నాయి. ప్రస్తుతం పలుచోట్ల వరి దుబ్బు దశ నుంచి పొట్ట దశలో ఉంది. ఈ సమయాన నీరు అవసరం ఉండడంతో ఇప్పుడు కురిసిన వర్షం ప్రయోజనకరమని రైతులు చెబుతున్నారు. ఇక మొక్క దశలో ఉన్న మిర్చి పైరుకు సైతం మంచిదని తెలుస్తోంది. అయితే, పత్తికి కొంత అనుకూలమే అయినా పలుచోట్ల ముందుగా వేసిన పత్తి కాయ పగిలి రంగు మారే అవకాశముంది.

ఇంకా వీడని దుర్గంధం..

- ప్రభుత్వ కార్యాలయాలను వదలని వరద జ్ఞాపకాలు
- గదుల్లో ఉండలేక ఆరుబయట విధులు


ఆరుబయట విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంరూరల్: ఈనెల మొదటి వారంలో వచ్చిన వరద బీభత్సం జ్ఞాపకాలు ఇంకా కళ్లముందే కదులుతున్నాయి. వరదలతో సర్వం కోల్పోయిన మున్నేటి పరీవాహక ప్రాంత ప్రజలు ఇళ్లకు చేరుకుంటున్నా కనీస సామగ్రి లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇక మున్నేటి వరదతో ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం కూడా మునిగిపోయింది. వరద కారణంగా కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫైళ్లు, ఫర్నీచర్ తడిసిపోగా, కొన్ని ఫైళ్లు, ఫర్నీచర్ పనికి రాకుండా పోయాయి. కార్యాలయం మొదటి అంతస్తు వరకు నీరు చేరి అన్ని గదుల్లో బురద పేరుకుపోవడంతో ఉద్యోగులు 15రోజుల పాటు నాయుడుపేటలోని ఓ ఫంక్షన్ హాల్ నుంచే విధులు నిర్వర్తించారు.

అయినా అదే పరిస్థితి..

వరద తగ్గుముఖం పట్టాక ఎంపీడీఓ కుమార్ నేతృత్వాన రెండు ఫైరింజన్లతో బురద, మట్టి తీయించారు. అయినప్పటికీ బురద మరకలు అలాగే ఉండిపోగా, దుర్వాసనతో గదుల్లో కూర్చోలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఉపాధి హామీ పథకం, ఐకేపీ కార్యాలయాల ఉద్యోగులు ఆరు బయటే కుర్చీలు వేసుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. మరోపక్క కార్యాలయంలోని కంప్యూటర్లు, బల్లలు, కుర్చీలు, టేబుళ్లు తడిపోవడంతో ఉన్న వాటితోనే సర్దుకుంటున్నారు. ఇంకొన్ని కంప్యూటర్లు బాగున్నా విద్యుత్, నెట్ సౌకర్యం లేక సొంత ల్యాప్‌టాప్‌లు తెచ్చుకుని తమ సెల్‌ఫోన్ల ద్వారా హాట్‌స్పాట్‌గా వాడుకుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాలకు నెట్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు.


వరదకు తడిసి పాడైపోయిన ఫర్నీచర్


మరమ్మతుకు రావడంతో పక్కన పెట్టిన కంప్యూటర్లు

రికార్డు స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు


మధిరలో పర్యటిస్తున్న రామచంద్రరావు, నాయకులు

మధిర/ఖమ్మం లీగల్: తెలంగాణలో బీజేపీ ప్రాథమిక సభ్యత్వాలు రికార్డ్ స్థాయిలో నమోదవుతున్నాయని, పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభ్యత్వాలు స్వీకరిస్తున్నారని బీజేపీ తెలంగాణ సభ్యత్వ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు తెలిపారు. మధిరతో పాటు ఖమ్మం కోర్టులో న్యాయవాదులకు మంగళవారం సభ్యత్వాలు అందజేశాక ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే గతంలో అతి ఎక్కువ సభ్యులు ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీని అధిగమించి 10 కోట్లకు పైగా సభ్యత్వాలతో బీజేపీ ముందు నిలిచిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన కారణంగానే ఇది సాధ్యమైందని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సైతం గతంలో లేని విధంగా సభ్యత్వాలు నమోదవడంపై హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, విజయరాజు, ఏలూరి నాగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, రామిశెట్టి నాగేశ్వరరావు, మర్సకట్ల స్వర్ణాకర్, శ్రీహరి, మినుగు శంకర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్థలంలో ఆక్రమణలు

తెర వెనుక మున్సిపల్ అసిస్టెంట్ బిల్ కలెక్టర్


ప్రభుత్వం స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన హద్దులు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం స్థలం కనిపిస్తే చాలు గుడిసెలు వేయడం పరిపాటిగా మారింది. తాజాగా మంగళవారం సైతం 13వ వార్డులోని రైతు వేదిక సమీపాన మున్సిపాలిటీ స్థలంలో కొందరు గుడిసెలు వేయడమే కాక ఐరన్ షెడ్ల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయితే, ఆక్రమణలను అడ్డుకోవాల్సింది పోయి మున్సిపాలిటీలోని ఓ అసిస్టెంట్ బిల్ కలెక్టర్.. ఓ పార్టీ నాయకుడి పర్యవేక్షణలో అక్కడ షెడ్లు వేయించే ప్రయత్నం చేసినట్లుతెలిసింది. రెండు రోజుల క్రితం ఈ విషయం తెలిసి మున్సిపల్ కమిషనర్ చింతల వేణు సదరు అసిస్టెంట్ బిల్ కలెక్టర్‌ను మౌఖికంగా హెచ్చరించినా ఆయన మంగళవారం షెడ్లు వేయించాడు. దీంతో ఆయనకు కమిషనర్ వేణు మెమో జారీ చేశారు. అంతేకాక 13వ వార్డు ఎస్సీ కాల్వను ఆనుకుని పలువురు గుడిసెలు వేస్తుండగా తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది, పోలీసులను పంపించి అడ్డుకున్నారు. ఈవిషయమై తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాము కాటుతో రైతు మృతి

తల్లాడ: మండలంలోని గాంధీనగర్‌తండాకు చెందిన కౌలు రైతు పాము కాటుతో మృతి చెందాడు. తండాకు చెందిన బోడా ధావు(48) తాను కౌలుకు తీసుకున్న పొలంలో వరి సాగు చేస్తున్నాడు. ఆయన ఈనెల 17న పొలంలో ఎరువు చల్లుతుండగా త్రాచుపాము కాలిపై కాటు వేసింది. దీంతో అపస్మారక స్థితికి చేరిన ఆయనను కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కాగా, ధావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సాతానిగూడెంలో మహిళ...

కామేపల్లి: పాము కాటుకు గురైన మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని సాతానిగూడెంకు చెందిన కొండమీది సుగుణ(58) సోమవారం రాత్రి సరుకుల కోసం గ్రామ సెంటర్‌లోని షాపు వద్దకు కాలినడకన వెళ్లి వస్తోంది. ఈక్రమంలో రహదారి వెంట ఆమె కాలిపై పాము కాటు వేయగా కేకలు వేస్తుండడంతో స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేసరికి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై ఆమె కుమారుడు రవి ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సెకండ్ హ్యాండ్ బైక్‌ల కొనుగోళ్లలో జాగ్రత్త

ఖమ్మంక్రైం: సెకండ్ హ్యాండ్ ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసే సమయాన తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో సెకండ్‌హ్యాండ్ ఫైనాన్స్ ద్వారా తీసుకున్న ద్విచక్రవాహనాలకు సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేనట్లు గుర్తించామని తెలిపారు. దీంతో ఆటో ఫైనాన్స్‌లోని వాహనాల పత్రాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. కొంతదరు ఫైనాన్సర్లు నెలవారీ వాయిదాలు చెల్లించని వారి నుంచి వాహనాలను సీజ్ చేసి ఫ్రెష్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేకుండానే వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఈమేరకు ఎవరైనా సరే వాహనాలు కొనుగోలు చేసే సమయాన అన్ని పత్రాలను సరిచూసుకోవడమే కాక రిజిస్ట్రేషన్ మార్పించుకోవాలని సీపీ సూచించారు. ఇక అమ్మే వారు సైతం ఈ విషయంలో జాగ్రత్త పాటించాలని, లేనిపక్షంలో ఏదైనా నేరాల్లో వాహనాలు పట్టుబడితే సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని సీపీ తెలిపారు. అంతేకాక చోరీలకు పాల్పడుతున్న వారు సీసీ కెమెరాలకు చిక్కకుండా బైక్‌ల నంబర్ ప్లేట్లు తొలగిస్తున్నారని.. ఇలా ఎవరైనా నంబర్ ప్లేట్ తొలగించినా, వంచినా వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

గుండెపోటుతో ఇద్దరు మాజీ సర్పంచ్‌లు..


వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

తల్లాడ: మండలంలోని ముద్దునూరు మాజీ సర్పంచ్ యరమల వెంకటేశ్వరరెడ్డి (57) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండు రోజుల కిందట అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతుండగానే ఆయనకు గుండెపోటు రాగా మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన రంగాపురం తీసుకురాగా పలువురు నివాళులర్పించారు.

ఆర్లగూడెం మాజీ సర్పంచ్..

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం మాజీ సర్పంచ్ కొర్సా రమేశ్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా తదితరులు నివాళులర్పించి రమేశ్ సేవలను కొనియాడారు. వివిధ పార్టీల నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, కణితి రాముడు, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎలిమి ఎల్లారెడ్డి, మందపాటి సుధాకర్‌రెడ్డి, తెల్లం సీతమ్మ, లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఖాతా నుండి రూ.73వేలు స్వాహా

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మధురానగర్‌కు ఒక ఉపాధ్యాయుడి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.73వేలకు పైగా నగదు స్వాహా చేసిన వైనమిది. ఆయన ఖమ్మం అర్బన్ పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగంలో ఇచ్చిన ఫిర్యాదులోని వివరాలు... కోటయ్య వాట్సప్‌కు సోమవారం రాత్రి ఎస్‌బీఐ పేరుతో వచ్చిన లింక్ తెరిస్తే ఖాతా నంబర్, డెబిట్ కార్డు నంబర్‌తో మరికొన్ని వివరాలు నమోదు చేయాలనే సూచన ఉంది. ఖాతా వివరాలు సరిగ్గానే ఉండడంతో బ్యాంకు నుంచే మెసేజ్ వచ్చిందని నమ్మి వివరాలు నమోదు చేయగానే రూ.73,950 డ్రా అయ్యాయి. ఈ విషయమై ఆయన మంగళవారం బ్యాంక్‌లో సంప్రదిస్తే తామెలాంటి మెసేజ్ పంపలేదని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి ఖమ్మం అర్బన్ పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశాడు.

గత నెలలో ఇంకో వ్యక్తి ఖాతా నుంచి రూ.5లక్షలు

ఖమ్మం 14వ డివిజన్ కొత్తగూడెంకు చెందిన మాధవరావు ఖాతా నుంచి రూ.5లక్షలు స్వాహా చేశారు. ఆయన బ్యాంక్‌లో లోన్ కోసం వెళ్లి దరఖాస్తు ఇచ్చి వచ్చాక గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ ఉద్యోగులుగా చెప్పారు. దీంతో నమ్మిన ఆయన ఖాతా నంబర్, ఏటీఎం పిన్‌వివరాలు చెప్పగా నిమిషాల వ్యవధిలోనే ఖాతా నుంచి రూ.5 లక్షలు డ్రా కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి ...

ఖమ్మంక్రైం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తిరుమలాయపాలెం మండం బీరోలుకు చెందిన యల్లావుల వెంకటేశ్వర్లు(35) ఖమ్మం గాంధీనగర్‌లో నివసిస్తూ ఆర్టీఓ ఏజెంట్ వద్ద పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై అయిన ఆయన ఈనెల 22వ తేదీన మత్తులోనే గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో ఖమ్మంలో చికిత్స చేయించి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, వెంకటేశ్వర్లుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ తెలిపారు.

భారీగా గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడించిన ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో మంగళవారం ఐదు కేసుల్లో 319 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఏపీ రాష్ట్రం పుసులంక నుంచి 14 కేజీల గంజాయి తరలిస్తూ హైదరాబాద్‌లోని బాలానగర్ (ఫతేనగర్)కు చెందిన శక్తి రాహుల్, గోపిశెట్టి అక్షిత్ పట్టుబడ్డారని.. ఏపీలోని చింతూరు నుంచి 100 కేజీల గంజాయిని తరలిస్తూ పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మున్వర్ అలీ, నేరేళ్ల అపర్ణ, నేరేళ్ల అఖిల్ దొరికారని.. మోతుగూడెం నుంచి 180 కేజీల గంజాయిని తరలిస్తూ హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు చెందిన దత్తుపంచాల్ పట్టుబడ్డాడని, మరో 25 కేజీల గంజాయిని తరలిస్తున్న ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన గణేశ్, శేఖర్ చౌదరి, గుంటూరుకు చెంది న బొనిగెల మహేశ్, బాపట్ల జిల్లాకు చెందిన చేగుడి దినేశ్‌ను ఆబ్కారిశాఖ అధికారులు పట్టుకున్నారని వెల్లడించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, పట్టుబడిన వారి వద్ద నుంచి రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

ఎన్నో కేసులు..

కాగా, మున్వర్ అలీపై గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులున్నాయని డిప్యూటీ కమిషనర్ చెప్పారు. 2007లో మహారాష్ట్రలోని పాట్నాలో ఒక కేసు, 2013లో నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, 2017లో నిజామాబాద్ 4 టౌన్‌లో ఒక కేసు, 2018లో నిజామాబాద్ రూరల్‌లో మరో కేసు, 2017లో వేర్వేరు ప్రాంతాలైన బాచన్నపేట (వరంగల్ జిల్లా), పత్తిపాడు (ఈస్ట్ గోదావరి), భవానీపురం (ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం), విజయవాడలోని ఉంగుటూరులో కేసులున్నాయన్నారు. మున్వర్ అలీతో పాటు పట్టుబడిన నేరేళ్ల అపర్ణ, అఖిల్ కూడా గంజాయి తరలిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారని, అపర్ణ భర్త సదయ్య, మున్వర్ అలీ గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడి, పలుమార్లు జైలుకి కూడా వెళ్లి వచ్చారని, అయినప్పటికీ వీరి పద్ధతిలో మార్పు రాలేదని చెప్పారు. ప్రస్తుతం మున్వర్ అలీతో నేరేళ్ల సదయ్య భార్య అపర్ణ, అతని కుమారుడు అఖిల్ కూడా కలిసి గంజాయి తరలిస్తున్నారని జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, జిల్లా ఎక్సైజ్ శాఖ ఎస్పీ జానయ్య, భద్రాచలం ఎక్సైజ్ శాఖ సీఐ రహీమున్నీసాబేగం, రమేశ్, ఎస్ఐలు గౌతమ్, అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ అలీం, కానిస్టేబుళ్లు బాబు, వీరబాబు, రాకేశ్, కిరణ్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, భద్రాచలంలో భారీగా గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులను ఆ శాఖ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అభినందినట్లు జనార్దన్‌రెడ్డి వివరించారు.

సిటీ.. బాబు స్కిట్

లడ్డూ వివాదంపై సిట్ ఇన్‌చార్జ్‌గా అత్యంత వివాదాస్పద ఐపీఎస్ అధికారి త్రిపాఠి

చంద్రబాబు అనుకూల వాదనకు బలం చేకూర్చడమే లక్ష్యంగా ఏర్పాటు

సాక్షి, అమరావతి : అనుకున్నంతా అయ్యింది.. తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మరో కుట్రకు తెరతీశారు. లడ్డూ ప్రసాదం వివాదంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పేరిట తిమ్మిని బమ్మిని చేసే కుతంత్రానికి తెరతీశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీతోపాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్‌ను బేఖాతరు చేస్తూ.. తాము చెప్పినట్టుగానే దర్యాప్తును ప్రభావితం చేయాలన్న లక్ష్యంతోనే సిట్‌ను నియమించారు. తానే కర్త, కర్మ, క్రియగా మారి తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు.. ఆ కుట్రను కప్పిపుచ్చడమే లక్ష్యంగా ఈ సిట్‌ను ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతోంది. ఎందుకంటే అవాస్తవ ఆరోపణలతో తిరుమల పవిత్రతను టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బ తీసిందన్నది బట్టబయలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన ఏ ఆరోపణకు కూడా ఆధారం చూపించలేకపోయారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదన్నది స్పష్టమైంది. ఇక కర్ణాటక సహకార పాడి రైతుల సమాఖ్య డెయిరీ (నందిని నెయ్యి)కి ఎందుకు కాంట్రాక్టు ఇవ్వలేదని నిలదీసేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే తొలిసారిగా నందిని డెయిరీకి కాంట్రాక్టు ఇవ్వకుండా మహారాష్ట్రలోని ప్రైవేటు డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టిందన్నది వెల్లడైంది. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి విపరీతమైన దుర్వాసన వస్తుందని ఆహార శాస్త్రవేత్తలు సైతం స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో తిరుమల లడ్డూ ప్రసాదంపై అటువంటి ఫిర్యాదులు రాని విషయాన్ని గుర్తు చేశారు. అన్నింటికంటే ప్రధానంగా.. నెయ్యి కల్తీ జరిగినట్టు నివేదిక వస్తే టీడీపీ ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం కింద కేసు ఎందుకు నమోదు చేయాలేదని నిపుణుల ప్రశ్నకు చంద్రబాబు ప్రభుత్వం


కూటమి సేవలో ఘనాపాఠి

ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన త్రిపాఠి తీరుపై 'కూటమి సేవలో ఘనాపాఠి' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనం

ఖంగుతింది. దాంతో రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల లడ్డూ ప్రసాదానికి కళంకం ఆపాదించే కుట్ర పన్నారని సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. లడ్డూ ప్రసాదం అంశంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించాలని దేశ వ్యాప్తంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. మరోవైపు టీడీపీ దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ సమర్థవంతంగా తిప్పికొట్టింది. లడ్డూ ప్రసాదం అంశంపై హైకోర్టుగానీ సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితోగానీ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. రాజ్యసభ మాజీ సభ్యుడు, తిరుమల వ్యవహారాలపై సాధికారికత ఉన్న సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు వ్యాఖ్యలపై విచారించాలని కోరారు. దేశ వ్యాప్తంగా హిందూ సంస్థలు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు కూడా ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేస్తున్నారు. దాంతో చంద్రబాబు బెంబేలెత్తారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారానో మరో దర్యాప్తు సంస్థ ద్వారానో విచారణ నిర్వహిస్తే తమ కుట్ర బట్టబయలవుతుందని ఆందోళన చెందారు. ఎందుకంటే చంద్రబాబు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిట్టింగ్ న్యాయమూర్తిగానీ ఇతర దర్యాప్తు సంస్థకు గానీ సమర్పించాలి. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఎటువంటి ఆధారాలు చూపించ లేరు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండేట్టుగా.. తాను చెప్పింది చేసేలా సిట్ ఏర్పాటు చేశారు.

సిట్ ఇన్‌చార్జ్‌గా వివాదాస్పద అధికారి

అత్యంత వివాదాస్పద అధికారి, ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి అక్రమాలకు కొమ్ము కాశారని ఆరోపణలు ఎదుర్కొన్న గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ బృందంలో విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజులను సభ్యులుగా నియమించారు. కాగా, ఎన్నికల్లో అక్రమాలకు చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి పక్కా పన్నాగంతో వ్యవహరించి రాష్ట్రంలో కీలక స్థానాల్లో ఉన్న పోలీసు అధికారులపై దుష్ప్రచారం చేశారు. ఎవరెవర్ని బదిలీ చేయాలి.. ఆ స్థానాల్లో ఎవర్ని నియమించాలనే జాబితాను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం గమనార్హం. టీడీపీ కూటమి ఒత్తిడికి లొంగి ఎన్నికల కమిషన్ అప్పటి గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్న పాలరాజును హఠాత్తుగా బదిలీ చేసింది. ఆ స్థానంలో చంద్రబాబు ఆదేశాలతో దగ్గుబాటి పురందేశ్వరి సూచించిన జాబితాలోని సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఐజీగా నియమించింది. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ రౌడీమూకలు చెలరేగిపోయి విధ్వంస కాండ సృష్టించడం తెలిసిందే. ప్రధానంగా పల్నాడులో టీడీపీ కూటమి గుండాలు దాడులు, దౌర్జన్యాలతో బెంబేలెత్తించారు. మాచర్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ రౌడీలు దాడులు చేశారు. అప్పటి గురజాల ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాసు మహేశ్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గురజాలలో బాంబు దాడులకు పాల్పడ్డారు. పల్నాడు వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్లు వేయకుండా పచ్చ రౌడీలు దాడులతో విధ్వంసం సృష్టించారు. టీడీపీ ఎన్నికల అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఎంతగా ఫిర్యాదులు చేసినా సరే.. సర్వశ్రేష్ఠ త్రిపాఠి పట్టించుకోలేదు. పోలింగ్ రోజున కనీసం ఫోన్లకు కూడా స్పందించలేదు. అదీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ట్రాక్ రికార్డ్. అంతటి వివాదాస్పద అధికారిని చంద్రబాబు ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై ఏర్పాటు చేసిన సిట్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించడం గమనార్హం. అంటే ఇక సిట్ దర్యాప్తు ఎలా సాగుతుందో.. నివేదిక ఎలా ఉండనుందో ఊహించుకోవచ్చని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నిబద్ధులైన అధికారులను కాదని..

సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించేందుకు ఐజీలు వినీత్‌బ్రిజ్‌లాల్, పీహెచ్‌డీ రామకృష్ణ, ఆకే రవి కృష్ణల పేర్లను పరిశీలిస్తున్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. కానీ వినీత్ బ్రిజ్‌లాల్ నిజాయితీపరుడు, ముక్కుసూటి అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన తాము చెప్పినట్టుగా తప్పుడు నివేదిక ఇవ్వరని చంద్రబాబు భావించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ అడ్డగోలు వ్యవహార శైలితో విసిగిపోయిన ఆయన డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లాలని కూడా భావిస్తున్నారు. ఇక పీహెచ్‌డీ రామకృష్ణ కూడా తాము చెప్పినట్టుగా నివేదిక ఇస్తారని చంద్రబాబుకు నమ్మకం లేదు. ఆకే రవికృష్ణ పేరు పరిశీలించారు గానీ పూర్తి నమ్మకం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. అందుకే ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠినే సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. లడ్డూ ప్రసాదంపై తాము వ్యాప్తిలోకి తెచ్చిన దుష్ప్రచారానికి అధికారిక ముద్ర వేసేలా.. తిరుమల పవిత్రతకు భంగకరంగా నివేదిక ఇచ్చి సర్వభ్రష్టత్వం పట్టించాలన్న చంద్రబాబు పన్నాగంలో భాగంగానే సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారన్నది స్పష్టమవుతోంది.

హిందువులంతా

ఏకం కావాలి

సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించను

- నేను పోరాటం చేయాలనుకుంటే ఆపేవారెవరూ లేరు
- హిందువులు కనీసం కోపం తెచ్చుకోకపోతే ఏం చేయగలం
- ప్రకాష్‌రాజ్ తెలుసుకుని మాట్లాడాలి
- సెక్యులరిజం వన్‌వే కాదు టూ వే
- అల్లాహ్, జీసస్‌పైన మీరు మాట్లాడగలరా?
- ఇంద్రకీలాద్రిపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా ఏకమై.. కలసికట్టుగా మాట్లాడాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హిందువులు మౌనం వహిస్తే, ఆ మౌనం భవిష్యత్తు తరాలను నాశనం చేస్తుందన్నారు. ధర్మాన్ని పరిరక్షించడం గుడికి వెళ్లే ప్రతి హిందూ బాధ్యత కాదా, నా ఒక్కడి బాధ్యతేనా అంటూ ప్రశ్నించారు. 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కనక దుర్గమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రిపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సనాతన ధర్మానికి సంబంధించి పోరాటం చేయాలనుకుంటే తనను ఆపేవారు ఎవరూ లేరన్నారు. ధర్మం కోసం పోరాటం చేస్తే చనిపోవడానికి సిద్ధమని, కానీ, అక్కడిదాకా తీసుకెళ్లనని చెప్పారు. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. సనాతన ధర్మానికి, పవిత్రతకు భంగం కలిగినప్పుడు మాట్లాడడం కూడా తప్పే అన్నట్లు చెబితే ఎలా..? మాట్లాడేవారు ఒకటికి వందసార్లు ఆలోచించి మాట్లాడండి అని చెప్పారు. సెక్యులరిజం అనేది వన్ వే కాదని అది టూ వే అని చెప్పారు. హిందువులు మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. మసీదులో చిన్నపాటి చోరీ జరిగితే ఇలాగే



మాట్లాడతారా అని అన్నారు. హిందూ దేవుళ్లపైన మాట్లాడే వారు అల్లాహ్ పైన, మహ్మద్ ప్రవక్తపైన, జీసస్‌పైన మాట్లాడగలరా అంటూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. ఇస్లాంపైన మాట్లాడితే ఆ మతం వారు పెద్దఎత్తున బయటకు వస్తారు అంటూ చెప్పారు. హిందువులను రోడ్లపైకి రమ్మని చెప్పడం లేదన్నారు. కనీసం హిందువులకు కోపం రాకపోతే ఏం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సినిమా ఇండస్ట్రీ వారికి కూడా విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మంపై ఇష్టానుసారం జోకులు వేయడం, మీమ్స్ చేయడం సరికాదన్నారు. ఓ సినిమా ఫంక్షన్‌లో జోకులు వేస్తున్నారని, ఎంతోమంది మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. దేశమంతటికి కలిపి 'సనాతన ధర్మ రక్షణ బోర్డు'తప్పనిసరి అని చెప్పారు. చిన్నప్పటి నుంచి తాను సనాతన ధర్మం పాటించే వాడినన్నారు. తమ ఇష్టదైవం ఆంజనేయస్వామి అని, తాము రామభక్తులమని చెప్పారు. ఈ సందర్భంగా పొన్నవోలు సుధాకరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిపైన విమర్శలు చేశారు. అంతకుముందు పవన్ కళ్యాణ్‌కు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం మెట్లను కడిగి, పసుపు రాశారు.

మహిళలను అడ్డుకున్న సిబ్బంది

ఆలయంలో మెట్లను పవన్‌కళ్యాణ్ శుభ్రం చేసే కార్యక్రమానికి అర్ధగంట ముందు, ఆ తర్వాత కూడా మహిళా భక్తులు మెట్ల పూజ చేసుకోకుండా ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. మెట్ల పూజ చేసుకుంటూ వస్తున్న మహిళా భక్తులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని క్యూలైన్‌లోకి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందికి, మహిళా భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. మెట్ల పూజ మొక్కు పూర్తి చేసుకోకుండా దర్శనానికి వెళ్లమని చెప్పడం ఎంత వరకు సబబని మహిళలు మండిపడ్డారు.

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త నిబంధనలతో కలవరం!

వడ్లను కూడా రాష్ట్రాలు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. 2022 రబీ సీజన్‌కు సంబంధించిన సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యాన్ని మిల్లింగ్ చేయలేదు. ఇందులో 60% ధాన్యాన్ని విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లోనే మిల్లింగ్‌కు వచ్చిన ధాన్యాన్ని 75 రోజుల్లోనే తప్పనిసరిగా సీఎంఆర్‌గా అప్పగించాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

సీఎంఆర్ పెండింగ్ ఉంటే ధాన్యం ఇవ్వరు

పైరవీలతో ఇష్టానుసారంగా ధాన్యాన్ని కేటాయింపజేసుకునే విధానానికి కూడా ఖరీఫ్ నుంచే ప్రభుత్వం చెక్ పెట్టనుంది. మిల్లు సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని కేటాయించాలని నిర్ణయించింది. ఆ మేరకు కచ్చితమైన లెక్కలను నిర్ధారించింది. ఇచ్చిన ధాన్యాన్ని ఒక్కో షిఫ్టుకు 8 గంటల చొప్పున రెండు షిఫ్టుల్లో పనిచేయడం ద్వారా 75 రోజుల్లో కేటాయించిన మొత్తం ధాన్యాన్ని మిల్లింగ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అప్పటికే రెండు మూడు సీజన్ల సీఎంఆర్ పెండింగ్ ఉన్నా.. మిల్లర్ల సంఘం నాయకులతో పైరవీలు చేయించుకొని తిరిగి ధాన్యం కేటాయింప జేసుకునే విధానానికి కూడా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొంది. మిల్లుల పనితీరును పర్యవేక్షించే బాధ్యత ఇప్పటివరకు అదనపు కలెక్టర్లకు, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఉండగా, ఇక నుంచి జిల్లా కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షించనున్నారు.

బ్యాంకు గ్యారంటీలు, ష్యూరిటీలు తప్పనిసరి

2021– 2022 రబీ సీజన్‌లో మిల్లులకు కేటాయించిన ధాన్యం మిల్లింగ్ కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత చూస్తే ఆ సీజన్‌కు సంబంధించిన ధాన్యం గానీ, డబ్బులు కానీ లెక్క తేల్లేదు. మిల్లులను తనిఖీలు చేస్తే అక్కడ ధాన్యం లేదు. చాలావరకు ధాన్యం పక్కదారి పట్టింది. రాష్ట్రంలోని 3 వేల మిల్లులకు కేటాయించిన 65 ఎల్ఎంటీ ధాన్యంలో సుమారు 30 ఎల్ఎంటీ ధాన్యం వివరాలు లేవు. ప్రస్తుతం ఆ ధాన్యాన్ని రికవరీ చేసే పనిలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఇకపై ధాన్యం కేటాయించిన మిల్లుల నుంచి ఆ ధాన్యం విలువలో 25 శాతాన్ని బ్యాంకు గ్యారంటీ రూపంలో తీసుకోవడమే కాకుండా, ఇద్దరు ఆర్థికంగా ఉన్న వ్యక్తుల ష్యూరిటీ, మిల్లర్ల అసోసియేషన్ నుంచి అఫిడవిట్ రూపంలో హామీ పత్రం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని మిల్లర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

జిల్లా వార్తలు

రాష్ట్రస్థాయి టోర్నీలో ఖమ్మం క్రీడాకారుల హవా


పతకాలు సాధించిన అథ్లెట్లతో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మంస్పోర్ట్స్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ అథ్లెట్లు, క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–20 బాలుర విభాగం 400, 800 మీటర్ల పరుగులో అథ్లెట్లు ద్వితీయస్థానంలో నిలిచారు. అలాగే, వివిధ విభాగాల్లో ఎస్‌కే అఫ్తాబ్, వివేక్ చంద్ర, ఎండీ ముబీన్, కె.అశోక్, ఎస్‌కే మస్తాన్, బి.బిందు, బి.వైశాలి, ఎ.మనుశ్రీ, కృష్ణవేణి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్ అహ్మద్ అభినందించారు.

రెగ్యులేటర్ షట్టర్లకు మరమ్మతులు


పనులను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో దేవినేని వెంకటరమణ కెనాల్ నీరు చేరేలా ఏర్పాటు చేసిన రెగ్యులేటర్ షట్టర్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, ఏఈ తాళ్లూరి నరేశ్ పర్యవేక్షణలో మంగళవారం మరమ్మతులు మొదలయ్యాయి. రెగ్యులేటర్ ద్వారా చెరువు నీరు వృథాగా పోతుండటంతో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం బాధ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే చెరువు నిండు కుండలా ఉండటంతో నీటిని కాపాడేలా మరమ్మతులు చేపడుతుండగా చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలేరు రిజర్వాయర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు నీరు సరఫరా చేసే ఎడమ కాల్వకు ఇటీవల భారీ వర్షాలు, వరదలతో పలుచోట్ల గండ్లు పడిన విషయం తెలిసిందే. ఈమేరకు గండ్లను అధికారులు యుద్ధప్రాతిపదికను పూడ్చివేసి ఈనెల 21న నీరు విడుదల చేశారు. అయితే, మత్స్య పరిశోధనా కేంద్రం సమీపాన భారీ గండిని పూడ్చివేసినా నీరు లీకేజీ అయింది. దీంతో మళ్లీ అధికారులు నీటి విడుదల నిలిపేసి గతంలో ఉన్న యూటీని పూర్తిగా తొలగించి కాల్వ కట్టను బండింగ్ చేశారు. ఈ పనులు మంగళవారం పూర్తి కావడంతో కాల్వ ద్వారా నీరు విడుదల చేశారు. తొలుత 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు క్రమంగా సాయంత్రానికి 1,700 క్యూసెక్కులకు పెంచారు. కాగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పరిశీలించి మరమ్మతులు, నీటి విడుదల వివరాలను సీఈ విద్యాసాగర్ ద్వారా తెలుసుకున్నారు. గండి పడిన ప్రాంతంలో యూటీని పూర్తిగా తొలగించినందున భవిష్యత్‌లో భారీ వర్షాలు, వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.


కాల్వలో ముందుకు వెళ్తున్న సాగర్ జలాలు

ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాల్సిందే..


సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

భద్రాచలంఅర్బన్: ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలకు తిరిగి తెలంగాణలో కలపాల్సిందేనని సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని తెలిపారు. పేద ప్రజలకు కనీస సౌకర్యాలు దక్కడం లేదని చెప్పారు. ఈమేరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం భద్రాచలానికి సరిహద్దున ఉన్న ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడమే కాక పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. సీపీఎం నాయకులు గడ్డం స్వామి, వై.వెంకట రామారావు, కుంజ మంగమ్మ, నాదెళ్ల లీలావతి, పి.సంతోష్‌కుమార్, ఎం.వీ.ప్రసాద్‌రావు, డి.సీతాలక్ష్మి, ఎంబీఎస్.నారాయణ, ముండ్రు ఝాన్సీ, కనకశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయాలు రావొద్దు


సీఈతో మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయం ఏర్పడకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని టీజీజెన్‌కో(థర్మల్) డైరెక్టర్ బి.లక్ష్మయ్య సూచించారు. పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు 9, 10, 11వ యూనిట్లలో ఉత్పత్తి తీరును పరిశీలించాక ఇటీవల నిర్వహించిన ఓవరాల్ పనుల తర్వాత ఉత్పత్తి వివరాలను సీఈ ఎం.ప్రభాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోల్ ప్లాంట్, స్టోర్‌ను కూడా పరిశీలించిన డైరెక్టర్ అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు ఎస్ఈలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారకుడైన యువకుడిపై కేసు

కామేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందగా, ప్రమాదానికి కారకుడైన యువకుడిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మద్దివంచకు చెందిన కట్టబోయిన వెంకటరత్నం(45) తన భార్య పద్మతో కలిసి బైక్‌పై ఈనెల 8న సాతానిగూడెంలో తమ బంధువు మృతి చెందగా చూసేందుకు వెళ్తున్నాడు. ఈక్రమాన కామేపల్లి మండలం పండితాపురం సంత సమీపాన ఒడ్డుగూడెంకు చెందిన అభినవ్ బైక్‌పై వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం చికిత్స పొందుతూ సోమవారం రాత్రి పరిస్థితి మృతి చెందాడు. ఈమేరకు ఆయన భార్య పద్మ ఫిర్యాదుతో అభినవ్‌పై కేసు నమోదు చేసినట్లు కామేపల్లి పోలీసులు తెలిపారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

వైరారూరల్: వైరా మండలం పుణ్యపురంలో వరి, పత్తి, మిరప పంటలను కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా పంటలను ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలపై రైతులకు అవగహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు సునీత, ఫణిశ్రీ, ఎం.ముఖేష్, వ్యవసాయాధికారులు టి.కరుణశ్రీ, మంజుఖాన్ పాల్గొన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

డీఈడీ మెరిట్ జాబితా విడుదల

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని డీఈడీ కళాశాలలో పదో బ్యాచ్ ప్రవేశాలకు సంబంధించి మెరిట్ జాబితాను ఐడీటీఏ పీఓ బి.రాహుల్ విడుదల చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన డీడీ మణెమ్మతో కలిసి జాబితా విడుదల చేశాక మాట్లాడారు. కళాశాలలో 50 సీట్లకు గాను 48 సీట్లు మెరిట్ ద్వారా, రెండు సీట్లు స్పెషల్ కేటగిరీగా కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు అభ్యర్థులు ఈనెల 27న కళాశాల ప్రాంగణంలో జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీకే.భవాని పాల్గొన్నారు.

గిరిజన యువతికి బాసటగా..

కృత్రిమ కాలు ఏర్పాటు చేయించిన ఎస్ఐ

ములకలపల్లి: అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న గిరిజన యువతి కాలికి ఆపరేషన్ చేసిన వైద్యులు విధిలేని పరిస్థితుల్లో కాలు తొడ వరకూ తొలగించారు. దీంతో ఆమె పడుతున్న అవస్థను తెలుసుకున్న ములకలపల్లి వాసి, ఖమ్మం ఎస్ఐ పుష్పాల రామారావు స్వచ్ఛంద సంస్థలు, దాతల చేయూతతో ఆమెకు కృత్రిమ కాలు ఏర్పాటు చేయించారు. ములకలపల్లి మండలం గుండాలపాడుకు చెందిన కారం మానస ఎనిమిదో తరగతి చదువుతుండగా కాలికి అంతుచిక్కని వ్యాధి సోకింది. కాలు మడమ భాగం సెప్టిక్ కావడంతో 2022లో తొడ భాగం వరకూ తొలగించారు. ఈ క్రమంలో మానసకు ఇంజనీరింగ్ సీటు వచ్చినా అనారోగ్యానికి తోడు ఆర్థిక సమస్యలతో చదువు మానేసి ఇంటి వద్దే ఉంటోంది. గత ఏడాది చలికాలంలో ఎస్ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యాన పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్స్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు గుండాలపాడులో చిన్నారులకు రగ్గులు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. అప్పుడే ఎస్ఐకి మానస సమస్య తెలిసింది. దీంతో పినపాకకు చెందిన తొలెం శ్రీనివాస్, విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, హైదరాబాద్‌లోని ఎవల్యూషన్ ప్రోస్తెటిక్ లింబ్ ప్రతినిధి జున్ను నాగరాజు సహకరించగా రూ.లక్షకు పైగా విలువైన మోకాలి వద్ద మడిచేందుకు వీలున్న ప్రోస్తెటిక్ లింబ్ (కృత్రిమ కాలు)ను విదేశాల నుంచి తెప్పించారు. ఈ కాలును సోమవారం హైదరాబాద్‌లో మానసకు ఏర్పాటు చేయగా ఆమె చదువుకునేందుకు వీలు కుదిరినట్లయింది. ఈ సందర్భంగా యువతితో పాటు ఆమె కుటుంబీకులు ఎస్ఐ రామారావు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.


గత ఏడాది మానసతో ఎస్ఐ రామారావు, తదితరులు (ఫైల్)


ప్రస్తుతం కృత్రిమ కాలు అమర్చాక..

నిరంతర శ్రమతోనే విజయం

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

మధిర: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని నిరంతరం శ్రమిస్తే తప్పక విజయం దరి చేరుతుందని హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మధిర మండలం మడుపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం తోట నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను పాటిస్తూ క్రమశిక్షణతో చదివి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. కాగా, తన క్లాస్‌మేట్ బి.జ్ఞానేశ్వరాచారిని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును సన్మానించారు. ఉపాధ్యాయులు బి.జ్ఞానేశ్వరాచారి, బూసా కోటేశ్వరరావు, కె.ఆదాము, కిశోర్, టి.జ్యోతిర్మయి, బీవీఎస్ఎం శర్మ, ఎ.కృష్ణమూర్తి, జి.రామచంద్రరావు, ఎస్.సంధ్యాలక్ష్మి, ఎస్.శ్రీదేవి, ఎం.సాములు, ఎం.మాధవరావు, సీహెచ్ చిట్టిబాబు, సూర్యప్రకాష్‌రావు, టి.సీత విద్యార్థులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జాలిముడి కాల్వకు గండి

మధిర: మండలంలో వైరా నదిపై నిర్మించిన జాలిముడి ప్రాజెక్టు ఎడమ కాల్వ సైడ్ వాల్ సోమవారం రాత్రి తెగిపోయింది. ఇటీవల వచ్చిన భారీ వర్షాలతో కాల్వ సైడ్ వాల్ కొంతమేర ధ్వంసమైంది. కాగా, ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు నీటి ఉధృతి పెరగడంతో ఇప్పుడు సైడ్ వాల్ తెగిపోయిందని రైతులు తెలిపారు. ఈ కాల్వ ద్వారా జాలిముడి, రొంపిమల్ల, మల్లవరం, సిరిపురం, వంగవీడు తదితర గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఈ మేరకు అధికారులు స్పందించి సైడ్ వాల్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


సైడ్‌వాల్ ధ్వంసం కావడంతో వృథాగా పోతున్న నీరు